


నేటి దినపత్రిక

# సూర్య

ఉత్తరాంధ్ర

సోమవారం 24-3-2025 పేజీలు 8

www.suryaa.com

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం

విజయనగరం శ్రీకాకుళం


## ఆక్రమణకు కాదేది అనార్హం..

**పేటలో ఆక్రమణల ఆక్రందన! -కాలువలు, చెరువులు కబ్జా -చర్యలు చేపట్టాలని పట్టణవాసుల విజ్ఞప్తి -పరిశీలిస్తున్నాం చర్యలు తీసుకుంటాం -మేజర్ పంచాయితీ అధికారులు**



**నరసన్నపేట, మార్చి 23, మేజర్‌న్యూస్**

నరసన్నపేట పట్టణంలో విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కావడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. పట్టణం వేగంగా అభివృద్ధి చెందడం, భూములకు అధిక రేట్లు ఉండడంతో పేటలో భూ ఆక్రమణలు, చెరువులు ఆక్రమణలు, కాలువలు ఆక్రమణలు విపరీతంగా పెరుగుతున్నాయి. వీధి రోడ్లను కూడా ఆక్రమిస్తూ వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. అటువంటి సంఘటనకు నిదర్శనం స్థానిక మారుతీ నగర్ 1వ వీధిలో గ్రామపంచాయతీ మురుగునీటి కాలువ ప్రవాహ గమనాన్ని ప్రక్కకు తిప్పి కొంత స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడం. గతంలో ఈ కాలువ ఆక్రమణకు ప్రయత్నించగా అప్పటి మేజర్ పంచాయతీ అధికారులు అడ్డుకున్నారని, అప్పటికి నిలిచిన పనులు ప్రభుత్వం మారడంతో కాలువ త్రిప్పే పనులు చకచకా జరిగిపోయాయి అని, కాలువను కప్పేసి అదనంగా రోడ్డు వరకు కాంక్రీట్ పనులు నిర్వహించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్దిరోజులుగా ఈ అంశంపై సోషల్ మీడియాలో, పలు పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు. ఆక్రమించుకున్న వారికి అధికారుల సహకారం ఉండడం వల్లే కనీస స్పందన లేదని, విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయితీ మురుగునీటి కాలువతో పాటు, కొంత వంశధార కాలువ స్థలం కూడా ఆక్రమణలకు గురైందని రెవెన్యూ పంచాయతీ అధికారులు దృష్టి సారిస్తే ఆక్రమణలు నిలువరించవచ్చునని, పట్టణంలో ఆక్రమణలపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని మేజర్ పంచాయతీ ఈవో ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా రెవెన్యూ అధికారులకు తెలియజేశామని, వారు ఆ స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ రికార్డుల ప్రకారము బౌండరీ కొలతలు వేస్తారని, వెంటనే మేజర్ పంచాయతీ చర్యలకు ఉపక్రమిస్తుందని అన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ సర్వే ఫుల్

# పారిశుద్ధ్యం పనులు నిల్







**గాజువాక, మార్చి 22, మేజర్‌న్యూస్**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ సర్వే మాత్రం ఫుల్‌గా జీవీఎంసీ అధికారులు, జీవీఎంసీ శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం శానిటరీ ఇన్స్పెక్టర్లు, వర్కర్లు చేస్తున్నప్పటికీ పారిశుద్ధ్యం పనులు , రోడ్లపై ఎక్కడ చెత్త అక్కడ మాత్రం విస్తారంగా ఉంటుంది. జీవీఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలతో గాజువాక జీవీఎంసీ జోన్ 6 పరిధిలో ఉన్న సచివాలయం శానిటరీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది తెల్లవారితే ప్రజలు ఎక్కడ ఎక్కువగా ఉంటున్నారో చూసుకొని వారి దగ్గరికి వెళ్లి మొబైల్ ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ సర్వేను పూర్తి చేస్తున్నారు తప్పా రోడ్లపై ఉండే చెత్తను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ క్లీన్ అండ్ గ్రీన్‌లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ 2025లో విజయం పొందే విధంగా చేయకపోవడం గమనార్హం. ఉన్నతాధికారుల ఆదేశంతో జోన్ 6 శానిటరీ ఇన్స్పెక్టర్లు తమ కింద స్థాయి ఉద్యోగులను సర్వే తప్పనిసరిగా చేయాలనే ఒత్తిడి తీసుకుని రావడంతో సచివాలయం అధికారులు ఉత్తుత్తి సర్వేలు చేస్తున్నారే తప్ప పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, రోడ్లపై ఉండే చెత్తను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడానికి శ్రద్ధ చూపించడం లేదు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కు స్వచ్ఛ సర్వేక్షణ 2025 లో ప్రథమ స్థానం అవార్డు తీసుకొని రావడంలో ఉన్న శ్రద్ధ రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలనే ఆలోచన లేకపోవడం ఉద్యోగుల పనితీరు అర్థం అవుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, సీఎంహెచ్ఓ, ఏఎంఓహెచ్ తదితరులు తక్షణమే స్పందించి స్వచ్ఛ సర్వేక్షణ సర్వేలో ఉన్న శ్రద్ధను పారిశుద్ధ్యంపై పెట్టాలని పలువురు కోరుతున్నారు.

## కొణతాల సారథ్యంలో నూకాలమ్మ ఆలయానికి ఉత్సవ కమిటీ

**చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం**



2 లో

## క్రాస్ ప్రోగ్రాంతో దాహార్తి తీరేనా..?





2 లో

**గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి...! -పనిచేయని చేతి బోర్లు అందని త్రాగునీరు...మండలంలో దాహం కేకలు**

## అడ్డగోలుగా.. ఆసుపత్రులు




2 లో

**అమాయక రోగులే పెట్టుబడి.. యథేచ్ఛగా కొనసాగుతున్న క్లినిక్లు.. -అనుమతులు లేకుండానే సర్జరీలు, అబార్షన్లు.. -నర్సులే వైద్యులుగా మారి ప్రమాదకరంగా కాన్పులు**

## వృద్ధులే సమాజానికి మార్గదర్శకులు

**వారి అనుభవాలు సమాజానికి ఎంతో అవసరం**

**-జిల్లా కలెక్టర్ డా. బి.ఆర్.అంబేద్కర్**



2 లో

## ఉద్యమాల ఊపిరి మామిడి అప్పల సూరి..

**పేదవాని ఆకలి ఉన్నంతకాలం ఉద్యమకారులు ఉంటారు -సినీ నటులు, దర్శకులు, నిర్మాత ఆర్ నారాయణ మూర్తి -కోమార్తిలో "మండేటి సూరీడు మామిడి అప్పలసూరి పుస్తకావిష్కరణ**



2 లో

## నేడు జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి -జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ఎన్ హరేంధిర ప్రసాద్**





**విశాఖపట్నం,మార్చి 23 మేజర్‌న్యూస్**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 మార్చి 24 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు మార్చి 24వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు వారు తెలియచేశారు.

# ఉద్యమాల ఊపిరి మామిడి అప్పల సూరి..



నరసన్నపేట, మార్చి 23, మేజర్‌న్యూస్

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కోమర్తి గ్రామంలో విప్లవ సూరీడు మామిడి అప్పలసూరి వర్ధంతి సందర్భంగా ప్రముఖ కవి అట్టాడ అప్పలనాయుడు రచించిన "మండే సూర్యుడు మామిడి అప్పలసూరి" జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణను పీపుల్ స్టార్, ప్రముఖ సినీ నటులు, దర్శకులు ఆర్. నారాయణమూర్తి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విప్లవ యోధుడు, బడుగు బలహీన వర్గాల, రైతు కార్మిక సంఘాల అభ్యున్నతికి సాయుధ పోరాటంతో భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపిన అప్పల సూరి జీవితం ఆదర్శవంతమైనదని, మైదాన ప్రాంతాల్లో జరిగిన అన్యాయాలపై ఉద్యమాలు నడిపి కమ్యూనిస్టు భావాలతో సామాజిక స్ఫూర్తి నింపిన మహోన్నతుడిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆపరేషన్ ఖగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులను హరిస్తూ, వారిని పొట్టన పెట్టుకుంటుందని ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా సంపదను దోచు పెట్టేందుకు ఆదివాసి హక్కులను అన్యాయంగా అణచివేసేందుకు, కమ్యూనిస్టులను అంతమొందించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ఆపరేషన్ ఖఘార్ పేరుతో ముందుకు తీసుకొచ్చారని, దానిని కమ్యూనిస్టు నాయకులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటులు దర్శకులు నిర్మాత ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ కుమార్తె అమరవీరుల కమిటీ స్ఫూర్తితో రచించబడిన ఈ పుస్తక ఆవిష్కరణలో భాగస్వామిని కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని, శ్రీకాకుళం ఉద్యమాల పురిటి గడ్డ, సాయుధ పోరాటాలతో సమన్యాయానికి కృషిచేసిన విప్లవ సూరీడు అప్పలసూరి అని అన్నారు . ఆదివాసీలపై అన్యాయముగా జరుగుతున్న రాజ్యం సను ఆపకపోతే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోవాలని, ఈ భూమి మీద పేదవాని ఆకలి ఉన్నంతకాలము దోపిడీదారుల ఉన్నంతకాలము ఉద్యమకారులు ఉంటారని, వారిని అణచివేసే శక్తి ఈ రాజ్యానికి ఉండదని అన్నారు, సంపదను కార్పొరేట్ శక్తులకు పోతున్నాయని, ఆదాని అంబానీ మోడీల రాజ్యంలో పేద వర్గాలకు అన్యాయం జరుగుతుందని, కమ్యూనిస్టులు అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనని రాష్ట్రంలోని రాజకీయ పార్టీల నాయకులు వ్యతిరేకించాలని, ఉత్తర భారతదేశ ఆజమాయిసీ కోసం జనాభా ధమాషా ప్రకారం పునర్విభజన చేయడం వల్ల దక్షిణ భారతదేశంలో ఉన్న ఎంపీ సీట్లు కోల్పోవలసి వస్తుందని దీనిని తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని, దక్షిణ భారతదేశ రాష్ట్రాలు వ్యతిరేకించవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు మామిడి అప్పలసూరి తన ఐదు పదుల జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని కొనియాడారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మైదాన ప్రాంతంలో ఉద్యమాలు సలిపి జైలు జీవితాన్ని గడిపినా ప్రభుత్వాలు భూస్వాములకు వ్యతిరేకంగా తన పోరాటపటిమను చాటి చెప్పిన అప్పలసూరి జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని, నేడు మోడీ సామ్రాజ్యవాద విధానాన్ని అవలంబిస్తూ గిరిజన ప్రజలపై దామన కాండను ప్రదర్శిస్తున్నారని దానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలను పోరాటం చేయాలని ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులుగా అట్లా అప్పలనాయుడు, తాండ్ర ప్రకాష్, దంతలూరి వర్మ,తామడ సన్యాసిరావు, కొర్రాయి నీలకంఠం, కృష్ణమూర్తి, జేవి సత్యనారాయణమూర్తి, సిహెచ్ ఫకీరు నాయుడు, కే రామగోపాల్, రౌతు వాసుదేవరావు, గంట్యాడ గౌరు నాయుడు, చీకటి దివాకర్, మిస్కా కృష్ణయ్య, చౌదరి లక్ష్మణరావు, కే శ్రీనివాస్, వాన కృష్ణచంద్, ఆగూరు మహేశ్వరరావు పాల్గొన్నారు. మామిడి క్రాంతి సీనియర్ న్యాయవాదులు స్వాగతం ఉపన్యాసం చేశారు. మామిడి అప్పల సూరి కుటుంబ సభ్యులు, సిపిఐ సిపిఎం ఎంఎల్ నాయకులు, ప్రముఖ న్యాయవాదులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధులే సమాజానికి మార్గదర్శకులు

జామి,మార్చి 23, మేజర్ న్యూస్

నేటి తరం యువతకి వృద్ధుల అనుభవాలు ఎంతో అవసరమని, వారి అనుభవాలతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. జామి మండలం అట్టాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బి.ఎన్.ఆర్. ఆశ్రమం 6వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఆశ్రమంలో నిర్విరామంగా వృద్ధులకి సేవలు అందించడం గొప్ప విషయమని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులను ఆదుకోవాలనే తపనతో ఆశ్రమ నిర్వాహకులు భీశెట్టి శారద, డాక్టర్ బాల భార్గవి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. సమాజంలో వృద్ధులను గౌరవించాల్సిన బాధ్యత యువత పై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల కు ప్రతి అంశంలో అండగా ఉంటుందని, అందుకే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వృద్ధుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కలెక్టర్ చెప్పారు. డిఆర్డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ బి.ఎన్.ఆర్. ఆశ్రమానికి ఉత్తరాంధ్రలో ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. నిత్య అన్నదాన క్షేత్రం గా నిర్వాహకులు మంచి పేరుని తెచ్చుకున్నారని చెప్పారు. జిల్లా పరిపాలన యంత్రాంగంనుండి ఎటువంటి సహాయం కావాలన్నా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల జ్యోతి, భీశెట్టి శారద, డాక్టర్ బాలభార్గవి, దవడ కొండబాబు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి మజ్జి కృష్ణారావు, అట్టాడ, కోరుకొండ పాలెం సర్పంచ్ లు అమ్మన్న దొర, బోని కృష్ణ, భీశెట్టి ఆధిబాబు, ఆశా, శిరీష, లోకేశ్, రెండు గ్రామాల్లో ని యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రాస్ ప్రోగ్రాంతో దాహార్తి తీరేనా..?

పార్వతీపురం రూరల్, మార్చి 23, మేజర్‌న్యూస్

వేసవికాలం పూర్తిగా రాక ముందే మండలంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంది. దాహార్తిని తీర్చుకునేందుకు గిరిజనులు పడరాని పాట్లు పడుతూ సమీప వాగులను గడ్డలను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో ఉన్నటువంటి చేతి బోర్లు నిరుపయోగంగా దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నాయి . వేసవి దృశ్య ప్రభుత్వం చేపట్టిన క్రాస్ ప్రోగ్రాం ఫలితాలు ఇస్తాయా...? లేక గిరిజనులకు త్రాగేందుకు మంచినీరు లభించక అలమటిస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో క్రాస్ ప్రోగ్రాం ప్రారంభమై రోజులు గడుస్తున్న ఎక్కడ మాత్రం పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిగాయి అన్న పరిస్థితి కనిపించడం లేదు సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది చేతి బోర్లతో పాటు రక్షిత మంచినీటి పథకాలు వద్ద మరమ్మత్తులు నిర్వహిస్తున్నారు అయితే అనేక చేతి బోర్లు నిరుపయోగంగా ఉండడంతో రానున్న వ్యాసవిలో ఇవి ఎంత మేరా ప్రజల దాహార్తిని తీరుస్తాయి అన్న సందేహం కలుగుతుంది. మైదాన ప్రాంతాల్లో చాలావరకు ప్రజలు వ్యక్తిగత బోర్లను ఉపయోగిస్తున్నారు అయితే గిరిజన ప్రాంతాల్లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రక్షిత మంచినీటి పథకం తో పాటు గ్రామంలో ఉన్నటువంటి చేతి బోర్ యొక్క నీరే వారు అమృతంగా నేటికీ భావిస్తూ గొంతు తడుపుకుంటున్నారు. వేసవిలో ప్రతి ఏడాది పూర్తిస్థాయిలో త్రాగునీరు అందక గిరిజనులు ఇబ్బందులు పడుతూ ఉండడం సహజంగా మారింది అలాగే రక్షిత మంచినీటి పథకాలు కూడా పూర్తిస్థాయిలో ప్రజల దాహార్తిని తీర్చడం లేదని చెప్పాలి గతంలో చేసిన వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లు వల్ల జల జీవన మిషన్ పథకం పూర్తిస్థాయిలో సత్ఫలితాలు అయితే ఇవ్వలేదు అన్నది అక్షర సత్యం. కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయలు ముట్ట చెప్పేందుకే ఈ పథకం ప్రవేశపెట్టారు తప్ప ప్రజలకు త్రాగునీరు అందించే ఉద్దేశంతో కాదని అప్పట్లో తీవ్రస్థాయిలో విమర్శలు వినిపించాయి. ఇప్పుడు పరిస్థితిని చూస్తుంటే ఇది నిజమనే నమ్మక తప్పడం లేదు. ఎందుకంటే మండలంలోని అనేక పంచాయతీలకు ఈ పథకం ద్వారా త్రాగునీరు అందించేందుకు కోట్ల రూపాయలు కేటాయించారు. సిర్లం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి గ్రామానికి పైప్ లైన్లు ఏర్పాటు చేశారు వీటిని ఆయా రక్షిత మంచినీటి ట్యాంకులకు అనుసంధానం చేస్తూ ప్రతి గ్రామంలో ఇంటికో కొళాయి చొప్పున కనెక్షన్లు ఇచ్చారు ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో త్రాగునీరు సరఫరా చేయడం మాత్రం మరిచారు. వారానికి రెండు, మూడు సార్లు తప్ప కొళాయి నుంచి ప్రతిరోజు నీరు రావడంలేదని మండలంలోని మహిళలు ఆరోపిస్తున్నారు. ఆ వచ్చిన కొళాయి నీరు కూడా పూర్తిస్థాయిలో దాహార్తిని తీర్చడం లేదని వారు అంటున్నారు. ఇది కూడా ఎప్పటికప్పుడు మరమ్మత్తులకు గురి కావడంతో అనేక గ్రామాలకు పూర్తిస్థాయిలో సిర్లం నుంచి మంచినీరు అందడం లేదు. ప్రధానంగా డోకి శీల, చిన్న బొండపల్లి గ్రామాలకు గడిచిన వారం రోజుల నుంచి కుళాయిలు రాక ప్రజలు అల్లాడిపోతున్నారు ఈ విషయంపై ఇటీవల ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆయా సర్పంచ్ చేయడంతో స్పందించిన వారు మరమ్మతులు జరిపి నీరు సరఫరా చేశారు. ఇదే పరిస్థితి వేసవిలో కూడా కొనసాగితే నీరు కోసం మహిళలు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చిత్తశుద్ధిగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు విధులు నిర్వహించి ఎక్కడా కూడా నీటి ఎద్దడి లేకుండా చూస్తే క్రాస్ ప్రోగ్రాం మంచి సత్ఫలితాలు ఇచ్చిందని చెప్పాలి.

# ఇంటి మరమ్మతు సమస్యలకు హ్యాండీమేన్ యాప్ ఆవిష్కరణ

## యాప్‌తో పాటు సర్వీసును ప్రారంభించిన గంటా తనయుడు రవితేజ



విశాఖపట్నం, మార్చి 23, మేజర్‌న్యూస్

ఇంటి మరమ్మతు సమస్యలకు ఇంటి నుంచే ఫోన్ ద్వారా పరిష్కరించేందుకు లక్ష్మీ సాయి సర్వీస్ ప్రొవైడర్ రూపొందించిన Handyman యాప్‌తో పాటు సర్వీసును అందించే కార్యక్రమాన్ని భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ ఆదివారం మధురవాడ, వుడా హరితా గార్డెన్స్, స్నేహ కమ్యూనిటీ హాల్లో ప్రారంభించారు. Handyman యాప్ ద్వారా ఇంటి మరమ్మత్తులకు అవసరమైన టెక్నీషియన్, సామగ్రిని అందుబాటు ధరలో పొందే సువర్ణ అవకాశాన్ని లక్ష్మీ సాయి సర్వీస్ ప్రొవైడర్ అందించనుంది. అనేకమంది టెక్నీషియన్లకు ఉపాధిని కల్పించడంతో పాటు, వినియోగదారులకు ఇంటి మరమ్మత్తులను సులభతరం చేయనుంది. ఈ సందర్భంగా జనహితం కోరుకునే నాయకుల సహకారంతో, ఈ సేవను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు గంటా రవితేజ లక్ష్మీ సాయి సర్వీస్ ప్రొవైడర్ యాజమాన్యానికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లక్ష్మీ సాయి సర్వీస్ ప్రొవైడర్ ప్రొప్రయిటర్ కెవివి సత్యనారాయణ, కె.నీరజ, 5,7,8వ వార్డుల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# కొణతాల సారధ్యంలో నూకాలమ్మ ఆలయానికి ఉత్సవ కమిటీ

అనకాపల్లి ప్రతినిధి, మార్చి 23, మేజర్‌న్యూస్

రాష్ట్ర పండుగగా నూకాలమ్మ జాతర కొత్తమావాస్యను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో అమ్మవారు ఆలయానికి మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సారధ్యంలో నూతన ఉత్సవ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించగా ఆదివారం ఆలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గా పీలా నాగ శ్రీను ( గొల్లబాబు), బోర్డు మెంబర్లుగా సూరే సతీష్ దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు , మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి,బోర్డు మెంబర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ బీమరశెట్టి రాంకీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ,ఆలయం స్పెషల్ ఆఫీసర్ కే శోభారాణి, సహాయ కమిషనర్ ఆలయం ఈఓ వెంపలి రాంబాబు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అడ్డుగోలుగా.. ఆసుపత్రులు

పార్వతీపురం, మార్చి 23, మేజర్‌న్యూస్

అమాయక ప్రజలు, రోగులు ప్రయివేట్ ఆసుపత్రులను నమ్ముకొని ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. మరో వైపు ఆర్థికంగా నష్టపోతున్నారు.జిల్లాలో అనుమతులు లేని ఆసుపత్రులు అడ్డగోలుగా కొనసాగుతున్నాయి. ఆర్ఎంపీలే స్పెషలిస్టులుగా చెలామణి అవుతున్నారు. నర్సులు.. ఆసుపత్రి సిబ్బందే డాక్టర్ల అవతారమెత్తి సర్జరీలు, అబార్షన్లు చేసేస్తున్నారు. క్లినిక్లు.. ఆసుపత్రులు.. నర్సింగ్ హోమ్ అంటూ బోర్డులు పెట్టి యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రోగుల ప్రాణాలతో చెలగాటమడుతున్నారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు అందుతున్నాయి. పార్వతీపురం లో ఇంటినే క్లినిక్ గా మార్చి ఆపరేషన్లు చేస్తున్న సెంటర్పై దాడులు నిర్వహించారు. వారితో డి యం.హెచ్ ఓ సమావేశం కూడా ఏర్పాటు చేశారు.ఇలా చెప్పుకుంటూ పోతే అధికారులు కళ్ళు కప్పి నకిలీ నర్సింగ్ హోమ్లు, క్లినిక్ లు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. గ్రామీణులను, అమాయక ప్రజలను బురిడీ కొట్టించి వైద్యం పేరుతో నకిలీలు భారీగానే దండుకుంటున్నారు. అక్కడక్కడ రోగుల ప్రాణాలు హరీ అంటున్నా అవి వెలుగులోకి రావడం లేదు.పార్వతీపురం ఒక ప్రముఖ ఆసుపత్రిలో ఒక రోగి కి సర్జరీ చేసేందుకు ముందు మత్తు ఇంజక్షన్ ఇవ్వగ ఆ పేసెంట్ కోమాలోకి వెళ్లి రెండు నెలలు దాటిపోయింది. మెరుగైన వైద్యానికి విజయనగరం, విశాఖపట్నం కేంద్రాలకు తరలించిన ఇంకా కోమా లోనే ఉన్నట్టు సమాచారం. ఆసుపత్రులు, క్లీనిక్ ను ఏర్పాటు చేయాలంటే అన్ని అర్హతలు కలిగిన వైద్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. వైద్యుని అర్హతలు, కీనిక్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, మౌళిక వైద్య వసతులు, వారి వద్ద పని చేసే సిబ్బంది వివ రాలు, వారి విద్యార్హతలు వంటివి వైద్యశాఖకు తెలియచేయాలి. ఆసు పత్రులలోని నోటీస్ బోర్డులలో కూడా వైద్యుల వివరాలు, అందించే వైద్యసేవలు వంటివి స్పష్టంగా పొందు పరచాలి. కానీ, కొంత మంది వైద్యులు ఇవేమీ పట్టించుకోవడటం లేదు. పట్టణ ప్రాంతాల్లోని ఏదోక సెంటర్ను ఎంపిక చేసుకోవటం, అక్కడున్న షాపింగ్ కాంప్లెక్సుల్లో, సంధుల్లోని ఇరుకు గదుల్లోనే క్లినిక్లను ప్రారంభించేస్తున్నారు. ఎటు వంటి మౌళిక వసుతులు ఉండవు. పెద్ద పెద్ద ఆసుపత్రులలో పని చేసే ప్రముఖ డాక్టర్ల పేర్లను విజిటింగ్ డాక్టర్లుగా వినియోగించుకొని బోర్డు లు ఏర్పాటు చేస్తున్నారు. తీరా అక్కడికి రోగులు వెళ్తే ఆర్ఎంపీలు, నర్సులు, ఆసుపత్రులలో పని చేసే సిబ్బంది దర్శనమిస్తున్నారు. వచ్చిన రోగులకు ఏవో పరీక్షలు చేయడం డబ్బులు దండుకోవడటం జరుగు తోంది. వారికి తోచిన మందులు రాసివ్వడం చేస్తున్నారు. ఏదైనా ప్రాణమిదికి వస్తే ఇతర ఆసుపత్రులకు పంపించి చేతులు దులుపుకుంటున్నారు. ఎక్కువగా ఆర్ఎంపీ డాక్టర్లు, నర్సులే ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఈ తరహా ఆసుపత్రులపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. పార్వతీపురంలో చిన్నపిల్లల మరణా లకు కారణమైన ఆసుపత్రిపై కూడా అధికారులు దాడులు నిర్వహించి గుర్తించాలి.ఎటువంటి అనుమతులు లేకుండా ఆసుపత్రిలో నర్సు కాన్పులు, అబార్షన్లు నిర్వహించడం విశేషం. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రి కొనసాగుతోంది. వైద్యాధికారులు దాడులు చేసిన సమయంలో కూడా కొంత మంది కొంతమంది తప్పించుకుంటున్నారు. ఈ తరహా ఆసుపత్రు లు జిల్లా వ్యాప్తంగా కుప్పలు తెప్పలుగా కొనసాగుతున్నాయి. వీటిపై ఎటువంటి అజమాయిషి పర్యవేక్షణ లేకపోవడంతోనే వీధికొక ఆసు పత్రి పుట్టుకొస్తోంది. అడ్డగోలుగా సర్జరీలు, అబార్షన్లు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

# పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు, ఎమ్మెల్యే గొండుశంకర్



శ్రీకాకుళం, మార్చి 23, మేజర్‌న్యూస్

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతు లు, హరిప్రసాద్ దంపతులు, శ్రీకాకుళం శాసన సభ్యులు శంకర్ ప్రముఖ దేవాలయాలను దర్శించుకున్నారు. పెదపాడు అప్పన్నమ్మ తల్లి, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయం, శ్రీ ఉమా రుద్ర కోటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు ఆలయ అర్చక బృందం వేద పండితులు మంగళ వాయిద్యం నడుమ ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ గంగాలమ్మ అమ్మవారికి ఆభరణాలు బహుకరణ



మునగపాక, మార్చి 24, మేజర్‌న్యూస్

మండలంలో మూలపేటలో శ్రీ గంగాలమ్మ అమ్మ వారికి ఆదివారం మొల్లేటి కూర్మారావు, కుమారి దంపతులు వీరు కుమారులు గణేష్, రూప్ కుమార్, బేడ ఎత్తు బంగారం మరియు రెండు తులాల వెండితో శతమానం, రూ. 5000 నగదు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు సర్పంచ్ బీసెట్టి గంగ అప్పలనాయుడు, మొల్లేటి నూకరాజు, కాండ్రేగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బి.సి. రుణాల దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం, మార్చి 23, మేజర్‌న్యూస్

బి.సి. కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని మార్చి 25, 2025 వరకు పొడిగించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బి.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గెడ్డమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా, కాపు కమ్యూనిటీకి చెందిన రుణాల మంజూరు కోసం దరఖాస్తుదారుల గరిష్ఠ వయోపరిమితిని 50 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచారు. అంటే, 21 నుండి 60 సంవత్సరాల వయస్సు గలవారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

# హోం మంత్రి వంగలపూడి అనిత పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు పంపిణీ



పాయకరావుపేట, మార్చి 23 మేజర్‌న్యూస్

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పుట్టినరోజు సందర్భంగా పాయకరావుపేటలో ఉన్న ఎస్సీ,బీసీ హాస్టల్లోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు పెది రెడ్డి చిట్టిబాబు,పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, దేవవరపు రాజబాబు, పల్లా విలియం కేరి, మజ్జూరి నారాయణరావు, బొంది కాశీ విశ్వనాథ్, జూరెడ్డి ప్రసాద్, కంకిపాటి వెంకటేశ్వరరావు, మల్లపురెడ్డి రమాకుమారి, బోడపాటి శ్రీను, ముంజులూరి దుర్గాప్రసాద్, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్‌కు ఘన నివాళి..

నరసన్నపేట మార్చి 23, మేజర్‌న్యూస్



సర్దార్ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని, భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటి ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలని నరసన్నపేట నాయకులు డిమాండ్ చేశారు.ఏఐవైఎఫ్ నరసన్నపేట నియోజవర్గ అధ్యక, కార్యదర్శులు అర్. అరవింద్, ఎన్. సాంబశివరాజు. ఆధ్వర్యంలో సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువకులను సమీకరించి స్వాతంత్ర ఉద్యమంలో వీరోచితమైన పోరాటం చేశారని గుర్తు చేశారు. సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల ఆశయాలను ఈనాటి యువత ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శ్యామ్, కిషోర్ యువత పాల్గొన్నారు.

# గొలుగొండ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలు వచ్చేనెల 13కి వాయిదా : ప్రిన్సిపాల్ కోటీశ్వరరావు



గొలుగొండ మార్చి 22 మేజర్ న్యూస్

గొలుగొండ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్ష వచ్చేనెల 13వ తేదీకు వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ పరీక్ష 6న జరగాల్సిన ప్రవేశ పరీక్ష, కొన్ని అనివార్య కారణాల వల్ల 13కి వాయిదా పడినట్లు గురుకుల పాఠశాలల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రవేశ పరీక్ష వాయిదా వేశారు కాబట్టి ఇంకా బాగా చదవడానికి అవకాశం దొరికిందన్నారు. బాగా చదివి పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

# వీఎంఆర్‌డీఏ కమిషనర్‌పై సీఎం ప్రజా వేదికలో ఫిర్యాదు

విశాఖపట్నం, మార్చి 23, మేజర్‌న్యూస్

వీ ఎం ఆర్ డీ ఏ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు మంగళగిరి లో ఉన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆఫీసులో విశాఖ టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ సదాశివరావు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పివిఎ క్వీఎన్ గుప్తా కలసి చీఫ్ మినిస్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వీఎంఆర్డీఏ పై సదాశివ నగర్ లేఔట్ విషయంపై ఫిర్యాదు చేశారు. పరదేశి పాలెం సర్వే నెంబర్ 180 లోని సదా శివ నగర్ లే అవుట్ కి సంబంధించి గృహ నిర్మాణాల అనుమతికి జీవీఎంసీ ఎలాంటి ఉత్తర్వులు యివ్వవద్దంటూ వీ ఎం ఆర్ డీ ఏ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. దీనిపై ఫిర్యాదు చేశారు. ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకునేలా ఆదేశించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# రెల్లి సామాజిక వర్గానికి ఎస్సీ వర్గీకరణలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించే వరకు ఉద్యమాలు

## రెల్లి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రం శెట్టి అప్పన బాబు

గొలుగొండ మార్చి 22 మేజర్ న్యూస్




రెల్లి సామాజిక వర్గానికి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లో ఐదు శాతం కల్పించే వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతంగా చేయాలని అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి అప్పన్న బాబు పిలుపునిచ్చారు. ఆదివారం గొలుగొండ మండలం కృష్ణ దేవి పేటలో విలేకరులతో మాట్లాడుతూ శనివారం నర్సీపట్నంలో జరిగిన రెల్లి గర్జన కార్యక్రమాంలో పాల్గొన్న రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులకు, యువతకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం నాయకత్వాన్ని పట్టించుకోకుండా కొంతమంది పేర్లే తెలిసేటట్లుగా ప్రకటించుకోవడం సోషనీయమని అన్నారు. రెల్లి కులస్తులు ఐక్యతగా ఐదు శాతం రిజర్వేషన్ సాధించేవరకు ఎవరెన్ని కుట్రలు చేసిన ఐక్యంగా పోరాడాలని పేరు ప్రఖ్యాతల కోసం పాకులాడవద్దని హితువు పలికారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగ, మాల కులస్తులకు ఏ విధమైన రిజర్వేషన్ కల్పించారో అదేవిధంగా రెల్లి కులస్తులను గుర్తించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు లను కోరుతున్నామని అన్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం మా సమస్యపై అసెంబ్లీలో స్పందించడం హర్షనీయమని అన్నారు. రెల్లి కులస్తులు ఎమ్మెల్యేలు ఎంపీలు లేనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వము ఐదు శాతం రిజర్వేషన్ కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర, జాతీయ స్థాయిలో రెల్లీలు అందరూ మరింత ఐక్యతగా పోరాడాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు శ్రీను, ఎల్లపు లోవరాజు, ముత్యాల చిన్నబ్బాయి, ఎర్రం శెట్టి కుమార్, శివ, ఎర్రంశెట్టి దుర్గాప్రసాద్, మజ్జి రత్నం రాజు, కోన ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

# భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు కార్యక్రమం

భీమునిపట్నం, మార్చి 23, మేజర్‌న్యూస్



స్థానిక శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆది వారం మెడికల్ క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం సీని యర్ సభ్యులు గురుస్వామి ఆయన గానంతో విశాఖ జిల్లాలో అయ్యప్ప భజనలతో తన గానంతో ఎంతో మంది భక్తులకు ఆధ్యాత్మికం అందించిన కీర్తి శేషులు ఆడిదం సన్యాసిరావు గత ఏడాది డిసెంబర్ 3 వ తేదీన శబరిమలై లో శివైక్యం చెందారు అలాంటి ఆయనకు నివాళులు అర్పించేందుకు సిద్ధాంతం ప్రకారం అడ్డు వచ్చేవి కావున మరి ఆయనకు నివాళులు అర్పించేందుకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆయన కుటుంబ సభ్యులను పిలిచి వారికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం వారి కుటుంబ సభ్యుల చేతులు మీదుగా ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్తంశెట్టి మహేష్, భీమిలి తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గొలగాని నరేంద్ర కుమార్ మరియు కార్పొరేటర్ గంటా నూకరాజు, భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాధం, ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, ముఖ్య సలహాదారులు గుగ్గిళ్ళ సాయి, కోశాధికారి పిల్లి శ్రీను, సుసరాపు మాధవ శాస్త్రి మధుపంతులు, కంటుభుక్త ముత్యాల రావు, మోహన్ కుమార్ మాస్టర్, గాదు ఆనంద్, సంకురభుక్త కొండబాబు, గౌరిపల్లి సన్యాసిరావు, కోండ్రు గోవింద్, పాడి శెట్టి కనకరాజు, కిరణ్ శర్మ పాల్గొన్నారు.

# యువ గేమర్లకు అరుదైన అవకాశం

విశాఖపట్నం, మార్చి 23, మేజర్‌న్యూస్

యువ గేమర్లకు ఇది గోల్డెన్ చాన్స్ అని చెప్పవచ్చు. హై-పర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ 2025 సంవత్సరానికి తన చీఫ్ గేమింగ్ ఆఫీసర్ (సీజీఓ) కోసం వెతుకుతుంది. ఈ సందర్భంగా ఐక్యూ సీఈఓ నిపున్ మర్యా మాట్లాడుతూ యువ గేమర్లకు ఇది గొప్ప అవకాశం అన్నారు. ఈ అవకాశం పొందాలంటే గేమింగ్ పై అభిరుచి, 25 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ బాధ్యతలలో ప్రధానంగా ఐక్యూ కొత్త స్మార్ట్‌ఫోన్ల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం, బ్రాండ్ ఈస్పోర్ట్ వ్యూహాన్ని నడిపించడం, భారతదేశంలోని టాప్ ఈస్పోర్ట్స్ గేమర్లతో చురుకుగా వ్యవహరించడం ఉన్నాయన్నారు. ఈ రోల్ ద్వారా సీజీఓ ఐక్యూ తాజా ఉత్పత్తులకు యాక్సెస్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రముఖ గేమింగ్ ఈవెంట్లలో బ్రాండ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఐక్యూ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ నాయకత్వ బృందంతో కలిసి పని చేస్తూ.. గేమింగ్ కమ్యూనిటీతో అనుసంధానం చేసి గేమ్‌ప్లే, గేమింగ్ స్టైల్, ప్రదర్శన, గేమ్ విశ్లేషణలపై విలువైన సమాచారాన్ని పంచుకునే అవకాశం పొందుతారన్నారు. ఐక్యూ తన సీజీఓకి రూ.10 లక్షలు అందిస్తుందని పేర్కొన్నారు. యువ గేమింగ్ అభిమాన్లు ఐక్యూ అధికారిక వెబ్‌సైట్ (www.iqoo.com/in/activity/cgo) ద్వారా మార్చి 30, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఉల్లాస్ పరీక్షలు ఇన్విజిలేటర్లే రాసేశారు.!

**పరీక్షలు రాస్తుండగా దొరికిపోయిన వైనం.! ఒక్కో ఇన్విజిలేటరుకు పదుల సంఖ్యలో పరీక్ష పేపర్లు.!**

**తోడూ నీడగా వెలుగు సిబ్బంది సహకారం.! విచారణ జరిపిస్తే పరీక్ష పత్రాల మీద దస్తూరి నిగ్గు తేలిపోతోంది.!**

**మేజర్ న్యూస్ పరిశీలనలో వెలుగు చూసిన నిజాలు.! మా ఫోటోలు వేయద్దన్న ఇన్విజిలేటర్లు .!**

**జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని విన్నపాలు.!**

మెరకముడిదాం మార్చి 23 మేజర్ న్యూస్.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని స్వయం సహాయక సంఘాలలో ఉన్న నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి "ఉల్లాస్ "పేరుతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సుమారు మూడు నెలల పాటు మొదట్లో183 మంది వాలంటీర్లను అపాయింట్ చేసి1830 అభ్యాసకులకు శిక్షణ ఇప్పించే కార్యక్రమం చేపట్టారు. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ఆ సంఖ్యను మధ్యలో కుదించినట్లు బోగట్టా. అభ్యాసకులకు శిక్షణ ఇచ్చే క్రమంలో ఉల్లాస్ ప్రోగ్రామింగ్ అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో మండలంలో వాలంటీర్లు అభ్యాసకులుకు శిక్షణ ఇచ్చే కార్యక్రమమును తూతూ మంత్రముగా, కట్టే, కొట్టే, తెచ్చే, అన్న చందముగా నిర్వహించారని విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు విచారణ చేపడితే అన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా శుక్రవారం పరీక్ష రాసే సమయానికి కూడా అభ్యాసకులు ఎవరన్నది కొంతమంది వాలంటీర్లకు తెలియకపోవడం గమనార్హం. ఉదయం 10 గంటలు నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగవలసి ఉండగా, ఉదయం 11 గంటలకే ఈ పరీక్షను ముగించేసిన కేంద్రాలు కొన్ని కనిపించాయి. దీంతో ఈ కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయిందని బహిరంగంగా విమర్శలు వస్తున్నాయి. ఈనెల 23వ తేదీన జరిగిన అభ్యాసకుల కోసం నిర్వహించిన రాతపరీక్ష ఇందుకు ఉదాహరణగా నిలిచింది. మేజర్ న్యూస్ పరిశీలనలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఉల్లాస్ పేరుతో నిరక్షరాశ్యులకు నిర్వహించిన పరీక్షను కొన్నిచోట్ల ఇన్విజిలేటర్లే రాసినట్లు ఆధారాలతో కూడిన సమాచారం అందింది. ఇది తెలిసిన కొందరు ఇన్విజిలేటర్లు మా ఫోటోలు పేపర్లో వేయద్దని చెప్పటం విశేషం. అందు కారణంగా పోటోలు వేయలేక పోతున్నాం. కొన్ని చోట్ల అభ్యాసకులను ముందుగా పెట్టి, పోటోలు తీసిసిన వెంటనే పంపించేసి ఇన్విజిలేటర్లే పరీక్ష రాసినట్లు పక్కా సమాచారం ఉంది. ఒక్కో ఇన్విజిలేటర్ పదుల సంఖ్యలో పరీక్ష రాశారని బహిరంగంగా విమర్శలు వస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా ఇదే తంతు. దీనికి తోడూ, నీడగా వెలుగు సిబ్బంది పూర్తి సహకారం అందించినట్లు పక్కా సమాచారం ఉంది. ఎవరైనా పక్కాగా ఉల్లాస్ పరీక్షలు జరిగాయని ఖండించిన వారుంటే ప్రతి పంచాయతీలో ఇద్దరు, ముగ్గురు అభ్యాసకుల ప్రశ్నాపత్రాలను రాండం గా పరిశీలిస్తే అసలు బండారం బయటపడుతుందని కొందరు ఆధారాలు చూపి మరి ఆరోపణలు చేస్తున్నారు. ఈ సవాలను స్వీకరించిన వారు ఉంటే నిరూపించేందుకు సిద్ధమని చెప్పేవారు కూడా ఉన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర విచారణ చేపట్టి బాధితులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**ఉల్లాస్ ప్రోగ్రామ్ అధికారి వివరణ:**

ఆదివారం మండలంలో జరిగిన ఉల్లాస్ పరీక్ష నిర్వహణ పై ఉల్లాస్ ప్రోగ్రామింగ్ అధికారి వారిని వివరణ కోరగా, పరీక్షలు పారదర్శకంగానే జరుగుతున్నాయని అన్నారు. ఏ సెంటర్లో కూడా పొరపాట్లు జరగలేదన్నారు. అభ్యాసకులు వాళ్లంతట వారే "స్వదస్తూరితోనే" పరీక్ష రాసినట్లు వివరణ ఇచ్చారు.

## గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలి

**గ్రంథాలయ అధికారి కృష్ణ మూర్తి పిలుపు**



తెర్లాం, మార్చి 23( మేజర్ న్యూస్)

ప్రతీ ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని గ్రంథాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మా కిష్టం అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించే దుకు పుస్తక పఠనం ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.పిల్లలకు పురాణ ఇతిహాస కథలు హాస్య కథలు రకరకాల ఆట పాట లు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పాఠకులు పిల్లలు గ్రంథాలయానికి రావాలని కోరారు. కార్య క్రమంలో ఆయనతో పాటు పిల్లలు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## 10లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎన్ఈ ఆర్



రణస్థలం, మార్చి 23, మేజర్ న్యూస్:

సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ( ఎన్ ఈ ఆర్ ) అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధి లో ఏడుగురు లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయం 8వ వార్షికోత్సవము



సారవకోట, మార్చి 23 మేజర్ న్యూస్

సారవకోట మండలం గొరిబంద పంచాయతీ గ్రామంలో ఉన్న శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయం ఎనిమిదో వార్షికోత్సవము ఆదివారం వైభవంగా నిర్వహించారు ప్రత్యేక పూజ కార్యక్రమాలు భక్తులు చేశారు భార్య అన్న సంతర్పణ నిర్వహించగా చుట్టుపక్క ఉన్న గ్రామాలు ప్రజలు అన్నసంతర్పణలో పాల్గొన్నారు రాత్రి సీతారామ కళ్యాణం అనే బుర్రకథ దొంపాక గ్రామం కళాకారులు వారిచే లైటింగ్ మరియు సినీ సెట్టింగులు తో కడురమ్యంగా ప్రదర్శించారు కార్యక్రమాలన్నీ గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు గ్రామ స్తులు సహకారంతో నిర్వహించారు.

## గ్రంథాలయలో "చదవడం మాకిష్టం" కార్యక్రమం

**గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూధనరావు**

**విద్యార్థులకు పలురకాల ఆటలు పోటీలు**

గరుగుబిల్లి ,మార్చి23, మేజర్ న్యూస్:

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాలు మేరకు ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా పద్యంలు, గద్యంలు, మరియు చదరంగం, క్యారంబోర్డు, పోటీలను విద్యార్థులకు నిర్వహిం చారు. ఈసందర్భంగా శాఖా గ్రంధాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు



మాట్లాడుతూ గ్రంధాలయాల్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలురకాల పుస్తకాలను సిద్ధం చేశామని వీటిని చదువు కోవాలని కోరారు.పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రంథాలయలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమను విజయవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథా లయ నిర్వాహకులు మధుసూద నరావు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠకులు ,విద్యార్థులు,పాల్గొన్నా రు.

## యువ గేమర్లకు అరుదైన అవకాశం

విశాఖపట్నం, మార్చి 23 మేజర్ న్యూస్:

యువ గేమర్లకు ఇది గోల్డెన్ చాన్స్ అని చెప్పవచ్చు. హై-పర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ 2025 సంవత్సరానికి తన చీఫ్ గేమింగ్ ఆఫీసర్ (సీజీఓ) కోసం వెతుకుతుంది. ఈ సందర్భంగా ఐక్యూ సీఈఓ నిపున్ మర్యా మాట్లాడుతూ యువ గేమర్లకు ఇది గొప్ప అవకాశం అన్నారు. ఈ అవకాశం పొందాలంటే గేమింగ్ పై అభిరుచి, 25 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ బాధ్యతలలో ప్రధానంగా ఐక్యూ కొత్త స్మార్ట్‌ఫోన్ల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం, బ్రాండ్ ఈస్పోర్ట్ వ్యూహాన్ని నడిపించడం, భారతదేశంలోని టాప్ ఈస్పోర్ట్స్ గేమర్లతో చురుకుగా వ్యవహరించడం ఉన్నాయన్నారు. ఈ రోల్ ద్వారా సీజీఓ ఐక్యూ తాజా ఉత్పత్తులకు యాక్సెస్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రముఖ గేమింగ్ ఈవెంట్లలో బ్రాండ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఐక్యూ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ నాయకత్వ బృందంతో కలిసి పని చేస్తూ.. గేమింగ్ కమ్యూనిటీతో అనుసంధానం చేసి గేమ్‌ప్లే, గేమింగ్ స్టైల్, ప్రదర్శన, గేమ్ విశ్లేషణలపై విలువైన సమాచారాన్ని పంచుకునే అవకాశం పొందుతారన్నారు. ఐక్యూ తన సీజీఓకి రూ.10 లక్షలు అందిస్తుందని పేర్కొన్నారు. యువ గేమింగ్ అభిమాన్‌లు ఐక్యూ అధికారిక వెబ్‌సైట్ (www.iqoo.com/in/activity/cgo) ద్వారా మార్చి 30, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ద్విగళ అష్టావధానం కార్యక్రమం

పాలకొండ, మార్చి23, మేజర్ న్యూస్:

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ విశ్వావసు నామసంవత్సర ఉగాది సందర్భంగా శ్రీ సూర్య చంద్ర కళా సాహితి పాలకొండ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్విగళ అష్టావధానం కార్యక్రమంనకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అవధానివర్యులు బంకుపల్లి రమేష్ శర్మ



ని,అవధాన చంద్రమస శతావధాని చంద్రశేఖర శర్మని, అవధాన చంద్రమసశతావధాని సాయికుమార్ శర్మని ఎమ్మెల్సీ విక్రాంత్ సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో కణపాక చౌదరి నాయుడు, మహేంద్రాడ సింహాచలాచార్య గారు, బౌరోతు శంకరరావు, అల్లెన దిలీప్ కుమార్, సాహిణి శ్రీనివాసరావు, గారాల సూర్యం, బొమ్మిరెడ్డిపల్లి వెంకట గణేశ్వరరావు, కరణం శంకర్రావు, వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకరరావు, వావలపల్లి గోవింద రావు గారు,నగర పంచాయతీ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

## ఆయా గ్రామాల్లో ఉల్లాస్ పై అర్హత పరీక్ష నిర్వహణ

**పరిశీలించిన ఏడి వైకుంఠరావు, నోడల్ అధికారి రమాజ్యోతి,ఎంపీ డీవో పైడితల్లిలు**

**మండల వెలుగు ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు వెల్లడి**

**పరీక్షలకు ఇన్విజిలేటర్ లుగా వ్యవ హరించిన అంగన్వాడి వర్కర్లు**

గరుగుబిల్లి, మార్చి23, మేజర్ న్యూస్:

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఆదివారం అక్షరాస్యత అర్హత పరీక్ష నిర్వహించారు.ఈమేర కు మండల పరిధిలోని ఆయా గ్రామా లలో 35 కేంద్రాలలో అక్షరాస్యత అర్హత పరీక్షను మండల వెలుగు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిం చారు.మండల పరిధిలోని ఉల్లిభద్ర, గొట్టివలస,తదితర గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైకుంఠరావు, ఉల్లాస్ కార్యక్రమం



నోడల్ అధికారి రమా జ్యోతి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి, వెలుగు ఏ పి ఎం పెదిరెడ్ల అప్పలనాయుడులు పరిశీలించారు.ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా అంగన్వాడి వర్కర్లు వ్యవహరించారు. పరీక్షల అనంతరం మూల్యాంకనం చేయడం జరుగు తుందని మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పెదిరెడ్ల అప్పల నాయుడు తెలిపారు.ఈపరీక్షల్లో 33% శాతం పొందిన వారిని ఉత్తీ ర్ణులుగా గుర్తించి వారికి ఎన్ ఐ ఒ ఎస్ ద్వారా ధ్రువపత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమం లో సిసిలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వి లక్ష్మణ రావు, టి చంద్రమోహన్, మరియదా సు,వివోఏలు వావిలపల్లి స్వాతి, ఇజ్జురోతు గౌరీ, గొట్టాపు జ్యోతి, బొబ్బిలి జ్యోతి, పిల్లి విజయ,తది తరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఉల్లాస్ కార్యక్రమం

**మండల స్థాయి అధికారులు సుడిగాలి పర్యటన**



తెర్లా, మార్చి 23 (మేజర్ న్యూస్)

నిరక్షరాస్యత వయోజన మహిళలకు అక్షరాస్యతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. మండలంలో గల పలు పాఠశాలలో ఏర్పాటుచేసిన అక్షరాస్యతపై మహిళలకు పరీక్షలను అంగన్ వాడి కార్యకర్తలు స్వచ్ఛంద సేవా కార్యకర్తలు నిర్వహించారు. మహిళలు నిరక్షరాస్యులు కాకుండా అక్షరాస్యత దిశగా చేపట్టిన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు మండల అభివృద్ధి అధికారి రేగి రాంబాబు ఎంఈఓ 2 ఆర్ పాపారావు సంయుక్తంగా పాముల వలసలో జరిగిన పరీక్షలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ ప్రతి మహిళ అక్షరాస్యత కోసం ముందుకు రావాలని మీ కుటుంబ భవిష్యత్తు కోసం విద్య అనివార్యమని అందుకు మహిళలు విధిగా చదవాలని ఆయన కోరారు. వెలుగు ఏపిఎం తామరపల్లి రాము వెలుగు సిబ్బంది అనేక కేంద్రాలను పరిశీలించి అక్షరాస్యత పరీక్షను జయప్రదం చేసేందుకు అనేక విధాలుగా చర్యలు తీసుకున్నారు. ఈ పరీక్షలను సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు సేవా కార్యకర్తలు అక్షరాస్యత పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో నిరక్షరాస్యత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా కొత్తమ్మతల్లిని దర్శించుకున్న అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, మార్చి 23, మేజర్ న్యూస్:

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కొత్తమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదయశాఖ ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ, గ్రామ పెద్దలు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలకగా వేద పురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మలు ఆలయంలోనికి తీసుకువెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో పురోహితులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి ప్రసాదాన్ని ఇచ్చి కొత్తమ్మతల్లి విశిష్టతను వివరించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్‌చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయంకు దీటుగా కొత్తమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అద్యక్షుడు బోయిన రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉల్లాస పరీక్షలు: ఎంపీడీవో

పార్వతిపురం రూరల్ మార్చి 23 ( మేజర్ న్యూస్):

మండల పరిధిలో ఆదివారం జరిగిన ఉల్లాస్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఈ పరీక్షలు ఏ విధంగా జరుగుతున్నాయి అన్నదానిపై ఎంపీడీవో జీవీ రమణమూర్తి పలు గ్రామాల్లో నర్సిపురం, హెచ్ కారాడవలస ,పేద బండపల్లి , ఎం ఆర్ నగరం ,సూడిగం, వెంకంపేట పంచాయతీలో



పర్యటించి పరీక్షలకు హాజరైన వారితో మాట్లాడుతూ, పరీక్షలు జరిగే విధానాన్ని పరిశీలించారు. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మహిళా సంఘ సభ్యులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు సంబంధించి అవసరమైన పాఠ్యాంశాలను ఇదివరకే మండల ఏపిఎం బలగ సన్నిబాబు పంపిణీ చేశారు.

## ఉచిత మెడికల్ క్యాంపు

పాలకొండ, మార్చి23,మేజర్ న్యూస్:

సాహితి సుధ డెవలప్మెంట్ సొసైటీ ఆద్వర్యంలో ,మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ విశాఖ వారి సహకారంతో పాలకొండ కోనేటిరాయుని చెరువుగట్టుపైగల గ్రంధాలయం వద్ద. ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది కి పరీక్షలు నిర్వహించారు.. డా. రేవతి ,డా.మాధురి ,డా.హారిక బృందం సుమారు పదకొండు మంది సభ్యులు హాజరయ్యరు. ఈ ఉచిత వైద్య శిభిరం ఇంతగా సక్సస్ అవటానికి బాద్యత వహించిన శ్రీమతి ఎ.స్వప్న శ్రీకాకుళం జిల్లా కో ఆర్డినేటర్ వారికి హాజరయిన డాక్టర్లు మరియు సిబ్బందికి మాసంస్థ తరపున ధన్యవాదాలు తెలియజేశారు .మహాత్మా గాంధీ హాస్పిటల్ యాజమాన్యానికి మా ప్రత్యేక అభినందనలు. తెలియజేస్తున్నాం. ఈకార్యక్రమం ఇంత దిగ్విజయంగా జరిగినందుకు సహకరించిన



బోనుమంతు తిరుమల రావు., ముంజేటి ఉమామహేష్ , అల్లెన శివదాసు, దూసి ప్రేమ్, గోవింద్ ,మహేష్ బాబు. గున్నయ్య , ధర్మారావు కి ధన్యవాదాలు తెలిపారు.

## వెస్పా కొత్త లగ్జరీ స్కూటర్ల ఆవిష్కరణ

విశాఖపట్నం, మేజర్ న్యూస్, మార్చి 23 :

ద్విచక్ర వాహన శ్రేణిలో దిగ్గజం వెస్పా, ఆదివారం విలాసవంతమైన జీవనసరళికి అనువైన లెజండరీ స్కూటర్ బ్రాండ్ వెస్పా, హై-ఎండ్ లగ్జరీ స్కూటర్లను ప్రవేశపెట్టినది వెస్పా, అప్రిలియా కొరకు పియాజియో అధీకృత డీలరు ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అద్భుతమైన వెస్పా -2025 వెస్పా స్కూటర్ల ఆవిష్కరణ వేడుకను నిర్వహించారు. ఈ ఆవిష్కరణ వేడుకలలో ముఖ్య అతిథిగా వాలెంటినా మిశ్రా, ప్రెసిడెంట్ మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్, ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవానికి భారతదేశపు నేషనల్ డైరెక్టర్ వారు, గౌరవ అతిథిగా డి సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రిజం కాలేజ్, విశాఖపట్నం వారు, ప్రత్యేక ఆహ్వానితులుగా రాహుల్ సరవగి, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కె సరవాగి అండ్ కో ప్రైవేట్ లిమిటెడ్ వారు, పిల్లి కృష్ణకాంత్, మేనేజింగ్ డైరెక్టర్, ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేవలం రవాణా సాధనంగా మాత్రమే కాక తరతరాల సాంస్కృతిక చిహ్నంగా, ప్రతిష్టాత్మకతకు నిదర్శనంగా వెస్పా పేరొందినది అన్నారు. వెస్పా విలాసవంతమైన స్కూటర్ బ్రాండ్‌పై విశాఖ ప్రజలు ఎల్లప్పుడూ ప్రత్యేక అనుబంధాన్ని కలిగి ఉన్నారని, విశాఖ నగరంలో 2025 సరికొత్త హంగుల వెస్పా స్కూటర్ మోడల్స్ ఆవిష్కరించినందుకు మేము చాలా సంతోషంగా ఉన్నాము అన్నారు. వెస్పా పోర్ట్‌ఫోలియో సరికొత్త సాంకేతికత అత్యుత్తమ పని సామర్థ్యత కలిగి, ఎప్పటిలాగే ఉత్తమ వాహనంగా మారుతుందని విశ్వసిస్తున్నాము అన్నారు. 2025 వెస్పా ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో:సాధారణంగా వాహన దారులు తమ స్కూటర్ మంచి నాణ్యత మరియు పనితీరు తోపాటుగా చక్కని డిజైన్ తో అందంగా ఆకర్షణీయంగా కూడ కనపడాలని ఆశించటం సహజం. ఖాతాదారుల మనోభావాలను



దృష్టిలో ఉంచుకుని వెస్పాను ప్రత్యేకంగా, ఐకానిక్ డిజైన్ లతో అందరిని ఆకర్షించు విధంగా రూపకల్పన చేసారన్నారు, ప్రతి ఖాతాదారు కోరుకునే అంశాలు కొత్త వెస్పాలో జోడించారని. ఆధునిక సాంకేతికత తోపాటు స్టయిల్ గా అందరిని ఆకర్షించు విధంగా రూపొందించారన్నారు. క్లాసిక్ ఇంటర్‌ప్రెటేషన్‌ను కోరుకునే వారి కోసం వెస్పా, వెస్పా ఎస్ ఆధునిక సాంకేతికత తోపాటు ముచ్చటైన సౌందర్యం పట్ల ఆసక్తి కలవారి కోసం వెస్పా టెక్, వెస్పా -ఎస్ టెక్, ప్రత్యేకమైన, స్పెషల్ -ఎడిషన్ కళాత్మకతను కోరుకునే వారి కోసం "వెస్పా క్వాలా" స్కూటర్లను ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూంలో అందుబాటులో ఉంచారన్నారు. వెస్పా ఎస్ వేరియంట్ 125 సిసి, 150 సిసి స్పోర్టీ ప్యాలెట్‌లో ఆలివ్ గ్రీన్ (మాట్), ఓరో, పెరల్ వైట్ , నీరో బ్లాక్ (మాట్), గియాల్లో ఎల్లో (మాట్), టుస్కానీ ఆరెంజ్, రెడ్ అండ్ పెరల్ వైట్, బ్లాక్ అండ్ పెరల్ వైట్ రంగుల్లో లభిస్తాయన్నారు. నూతనంగా ఆవిష్కరించిన 2025 వెస్పా పోర్ట్‌ఫోలియో విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, శ్రీకాకుళం లోని అన్ని ఓరా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి డీలర్లు వద్ద లభిస్తాయన్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి వెల్లడి**

**అర్జీదారులు సమస్యలను పరిష్కార వేదికలో తెలియజేయాలి**

**ప్రజలు తెలియజేసిన సమస్యలు పరిష్కారానికి చర్యలు**

గరుగుబిల్లి, మార్చి23,మేజర్ న్యూస్:
మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) కార్యక్రమంను నిర్వహించ నున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని జి పైడితల్లి వెల్లడించారు.మండల పరిధిలోని ఆయా గ్రామాల



ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించ నున్నామన్నారు. సమస్యలపై ప్రజలు విన తులు అందజేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైడితల్లి పేర్కొన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలు త్వరితగతిన పరిష్క రించేందుకు చర్యలు చేపట్ట నున్నా మన్నారు.

# గ్రామాల్లో ఉల్లాస్ పై అర్హత పరీక్ష నిర్వహణ

**పరిశీలించిన ఈవోపీఆర్డీ ఎం ఎల్ ఎన్ ప్రసాద్. మండల వెలుగు అధికారి శ్రీరాములు.**

**పరీక్షలకు ఇన్విజిలేటర్ లుగా వ్యవ హరించిన అంగన్వాడి వర్కర్లు**



సీతానగరం మార్చి 23 మేజర్ న్యూస్:
ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఆదివారం అక్షరాస్యత అర్హత( ఉల్లాస్ ) పరీక్ష నిర్వహించారు.ఈమేర కు మండల పరిధిలోని ఆయా గ్రామా లలో 42 కేంద్రాలలో 1430 గాను 1365 మందికి అక్షరాస్యత అర్హత పరీక్షను మండల వెలుగు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వెలుగు ఈవోపీఆర్డి ఎం ఎల్ ఎన్ ప్రసాద్. మండల వెలుగు అధికారి శ్రీరాములు పరిశీలించారు.ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా అంగన్వాడి వర్కర్లు వ్యవహరించారు. . అనంతరం ఏపీఎం శ్రీరాములు పరీక్షలకు హాజరైన వారితో మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం నిర్వహిస్తుండని పరీక్షల్లో 33% శాతం పొందిన వారిని ఉత్తీ ర్ణులుగా గుర్తించి వారికి ఎన్ ఐ ఒ ఎస్ ద్వారా ధ్రువపత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమం లో సిసిలు ఆనంద్. ప్రసాద్.సత్యనారాయణ .వసంత్ .మోహన్ తో పాటు ఉల్లాస్ వాలంటీర్ అంగన్వాడి సిబ్బంది వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంలో భారీ వర్షం

**ఉక్క పూతతో అల్లాడుతున్న ప్రజలకు ఊరట**



గుమ్మ లక్ష్మీపురం, మార్చి 23 (మేజర్ మేజర్)
గుమ్మలక్ష్మీపురం మన్యంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారత వాతావరణ శాఖ కూడా హెచ్చరించిన నేపథ్యంలో ఈ వర్షం మన్యంలో పడటంతో ఎండలకు, ఉక్క పూతతో విలవిల్లాడుతున్న ప్రజలకు ఒకంత ఊరట లభించింది. మార్చి నెలలోనే ఏజెన్సీలో భారీగా ఎండలు కాస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎప్పుడు వర్షాలు పడతాయా అని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ వర్షం ప్రజలకు ఎంతో ఊరట ఇచ్చిందని మన్యం ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఈ వేసవి కాలంలో ఎండలకు ప్రజలు తట్టుకునేందుకు వీలుగా అప్పుడప్పుడు వర్షాలు పడాలని మన్యం ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అక్షరాస్యత పరీక్షను తనిఖీ చేసిన కలెక్టర్ అంబేద్కర్



విజయనగరం బ్యూరో, మార్చి 23 , మేజర్ న్యూస్ :
ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన అక్షరాస్యతా పరీక్షను జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తనిఖీ చేశారు. ఆయన జామి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని అట్టాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అక్షరాస్యతా పరీక్షను ఆయన పరిశీలించారు. పరీక్ష రాస్తున్న వారితో మాట్లాడి, వారి అభ్యసన సామర్థ్యాన్ని ఈ సందర్భంగా తనిఖీ చేశారు. పరీక్షను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు.ఈ పర్యటనలో డిఆర్డిఏ పిడి ఏ.కళ్యాణ చక్రవర్తి, వయోజన విద్య డిడి అల్లు సోమేశ్వరరావు, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో నయనాలు ( కళ్ళు)జాగ్రత్త



## ప్రముఖ కంటి వైద్యం నగేష్ రెడ్డి

పార్వతిపురం రూరల్ మార్చి 23 ( మేజర్ న్యూస్):
వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలో బయట తిరిగే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలతో పాటు కళ్ళను కూడా పరిరక్షించుకోవాలి , లేదంటే కంటి సమస్యలు వచ్చే అవకాశంతో పాటు ఇంటి చూపు పోయే ప్రమాదం కూడా ఉందని ప్రముఖత వైద్యులు నగేష్ రెడ్డి అన్నారు. అందుకే కళ్ళను నిత్యం కాపాడుకోవడము మన భాద్యత అని గుర్తుంచుకోవాలని అన్నారు. వేసవిలో నయనాలను ఏ విధంగా కాపాడుకోవాలి, అన్నదానిపై పలు సూచనలు చేశారు.ఇప్పుడున్న వ్కెద్య సదుపాయాలు ఉపయోగించుకొని తగిన జాగ్రత్త లు కంటిని కాపాడుకోవడం చాల తేలిక అని అన్నారు.కళ్లు నిత్యం తడిగా ఉంటాయి. కంటి నిండా నీరు ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే నేత్రాలు నిండు జలాశయము వంటిది. మనిషి నిర్లక్ష్యం కారణంగా కంటిలో తడి ఆరిపోయి చూపు పోయే ప్రమాదం ఉంది. అన్ని ఇంద్రియములు లో కన్ను చాలా విలువైంది. అందమైన ఈ ప్రపంచం చూడాలి అంటే కళ్లు కలకాలం చల్లగా ఉండాలి. ఈ వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా వున్నందువల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వేడికి కన్ను పొడిబారి మనిషి దుష్ప్రవర్తన కారణంగా కంటి సమస్యలు ఏర్పడి చూపు కోల్పోయి అంధత్వం నకు దారి తీస్తున్నది. మనిషి నిముషానికి ఎనిమిది సార్లు కంటి రెప్పలు ఆర్పుతూ ఉంటాడు. అలా చేయడం ద్వారా కార్ణియాకు (నల్ల గుడ్డు) అవసరమైన నీరు చేరి కళ్లు ఎండిపోకుండా చేస్తాయి. ఈ కాలంలో ప్రయాణిస్తున్న వారికి వేడిగాలులు దృష్ట్యా తడి ఆరిపోయి కంటిలో లూబ్రికేటింగ్ (సరళత) తగ్గి దురద పెరిగి చూపు తగ్గి, వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వేసవి ప్రయాణంలో కంటి రెప్పలు నిముషానికి రెండు నుంచి మూడు సార్లు మాత్రమే కొట్టుకుంటూన్నాయని ఒక సర్వే లో వెల్లడించారు. దీని ఫలితంగా కంటి సమస్యలు వచ్చి చూపు తగ్గే అవకాశం, తీవ్రమ్కెన తలనొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**పొడిబారిన కన్ను లక్షణాలు:**
వెలుతురులో కళ్లు స్పష్టంగా కనబడకుండా వుండడం, నిలువుగా ఉన్న వస్తువులు, వైర్లు, గీతలు వంగినట్టుగా కనిపించడం,కళ్లముందు వున్న ప్రదేశంలో చుక్కలుగా కనిపించడం, ఒకే వస్తువు రెండుగా కనిపించడం, దీపం గాని బల్బ్ గాని దాని చుట్టూ ఇంద్రధనుస్సు లాగా రంగులు కనిపించడం, కంప్యూటర్లు లో పనిచేస్తున్న వారికి తీవ్రంగా తలనొప్పి ,కళ్లు తిరగడం, దురద, మంట, నీరు కారడం మొదలగు లక్షణాలు వుంటే వెంటనే




నేత్ర వ్కెద్యులు ని సంప్రదించి తగు చికిత్స పొందుతూ కంటి చూపు కాపాడు కోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వ్కెద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**
వేసవి కాలంలో ప్రయాణిస్తున్న వారు తప్పనిసరిగా కళ్ల జోళ్లు ధరి%శీ%చాలి. ప్రయాణంలో సెల్ ఫోన్ వినియోగం తగ్గించాలి. కంప్యూటర్లు వద్ద గంటల కొద్దీ గడపరాదు .కంటి రెప్పలు ఎక్కువ సార్లు కొట్టుకొనే విధంగా ప్రయత్నించాలి. తరచూ ముఖానికి చల్లని నీటితో కడుక్కొనే ప్రయత్నం చేయాలి. కంటికి దురదలు వచ్చే సమయంలో చేతితో నలపరాదు. ఈ వేసవి కాలంలో ప్రతీ ఒక్కరూ కళ్లపై అత్యంత శ్రద్ధ వహించి కంటికి ఎక్కువ వేడి తగలకుండా కళ్లజోళ్లు ధరించి చూపు కాపాడు కోవాలని జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి సూచనలు చేశారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



**సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తోట జీవన్న**

గుమ్మలక్ష్మీపురం, మార్చి 23 (మేజర్ న్యూస్):
స్వాతంత్ర పోరాట యోధుడు భగత్ సింగ్ పోరాట పటిమ యువతకు పాదరసంగా ఉండాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తోట జీవన్న అన్నారు.భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ఆశయాలను కొనసాగిస్తామని, భగత్ సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న రైతు సంఘం రాష్ట్ర నాయకులు బుడితి అప్పలనాయుడు అన్నారు.1931 మార్చ్ 23 న స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారి చేతిలో చిన్న వయసులోనే ఉరి కొయ్యాలను ముద్దాడిన విప్లవ వీరులు సాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94 వ వర్ధంతి సభను పార్వతీపురం పట్టణములో ఉన్న గొల్లవీధి లో సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. భారతదేశంలో కి వ్యాపారం పేరుతో వచ్చిన బ్రిటిష్ వారు దేశ పౌరులను బానిసలు గా చేసుకొని దేశ సంపదను దోచుకుపోయారని అన్నారు. మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న సమయంలో ఆకర్షితుడై భగత్ సింగ్ 13 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, అనంతరం చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వం లో బ్రిటిష్ వారిపై పోరాటాలు చేశారన్నారు. బ్రిటిష్ వారి లాఠీ దెబ్బలకు బలి అయిన లాలలజపతిరాయి మరణంతో చలించిపోయిన భగత్ సింగ్ బ్రిటిష్ అసెంబ్లీ పై బాంబు దాడి చేసారని, ఎవరి ప్రాణాలకు ఇబ్బంది లేకుండా, అయినా వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. ఆ సమయంలో మార్క్సిస్టు వామపక్ష భావజాల సిద్ధాంతాలు నచ్చి లెనిన్ నాయకత్వ లక్షణాలు తెలుస్కొంటూ, భారత దేశానికి అవసరం అయిన సోషలిజం గురించి పుస్తకాలు చదివారు. జైల్లో ఖైదీల హక్కుల కోసం 64 రోజులు నిరసన దీక్ష చేపట్టి విజయవంతం అయ్యారని, మార్చ్ 24 న ఉరి తీయాల్సి ఉండగా ప్రజల్లో వచ్చే తిరుగుబాటును తట్టుకోలేక ముందు రోజు మార్చ్ 23 సాయంత్రం 7 గం.లకు ఉరి తీశారన్నారు. ఈ మేరకు యువత భగత్ సింగ్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్యే, జిల్లానాయకులు బొత్స మోహన్ రావు, బుడితి భారతి, లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్ ఫర్ సేవలో స్వామిదయానంద సరస్వతి విగ్రహ ఆవిష్కరణ

## ఘనంగా ఎయిమ్ ఫర్ సేవా 17వ వార్షికోత్సవం నిర్వహణ

సీతానగరం మార్చి 23 మేజర్ న్యూస్:
మండలంలోని లచ్చయ్యపేటలోగల శ్రీస్వామి దయానంద సరస్వతి సేవాఆశ్రమం(ఎయిమ్ ఫర్ సేవా ఆశ్రమం)లో ఆదివారంనాడు సంస్థ 17వ వార్షికోత్సవంను ఘనంగా చేశారు. ఈకార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా గుడివాడ ప్రణవఆశ్రమం పీఠాధిపతులు స్వామి స్థైర్యానంద సరస్వతిపాల్గొని, దేశ వ్యాప్తంగా ఎయిమ్ ఫర్ సేవా ఆశ్రమాల వ్యవస్థాపకులు కీర్తిశేషులు శ్రీస్వామి దయానంద సరస్వతి విగ్రహాన్ని లచ్చయ్యపేటలో ఆవిష్కరణ చేశారు. సంస్థ ఆశయాలను లక్ష్యాలను వివరించారు, లచ్చయ్యపేటలో సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు.ఈకార్యక్రమంలో స్వామీజీతోపాటు బొబ్బిలి పురప్రముఖులు తూముల అచ్యుతవల్లి, రౌతు వాసుదేవరావు నాయుడు, కందుల శ్రీనివాసరావు,కొత్తారవి కుమార్,



సాల వెంకటఅప్పారావు, పుల్లెల శ్రీనివాసరావు, గోనా ప్రసాదరావు, శిల్పాచార్యులు జగన్నాథ స్వామి, జామి రమాదేవి, తంగుడు గురునాధరావు, గౌరీ దేవి, రాజశేఖర్ రావు, పొట్నూరు లీలావతి తదితరులతోపాటు లచ్చయ్యపేట సమస్త మేనేజర్ సురేష్ పాల్గొన్నారు. స్వామీజీ చక్కని ఉపన్యాసంను అందజేశారు.పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తమసంస్థలో పేదవిద్యార్థులకు, తల్లి- తండ్రి లేని పిల్లలకు, చదివించడానికి స్తోమతలేని పిల్లలకు 2025- 26 సంవత్సర అడ్మిషన్లు చేస్తున్నట్లు స్వామీజీ తెలిపారు. చేరదలచిన పేదవిద్యార్థులు అడ్మిషన్లు గూర్చి దగ్గరలో ఉన్న క్షేత్రాలుయాలను సంప్రదించాలన్నారు. ఉచిత విద్య, ఉచిత వసతి, ఉచిత భోజనం కల్పించబడునన్నారు. పేదవిద్యార్థులు ఈసదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లచ్చయ్యపేటలో స్వామీజీ చేతులమీదుగా అడ్మిషన్లను ప్రారంభించారు.

# శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ 67వ వార్షిక మహోత్సవములు

విజయనగరం టౌన్, మార్చి23 , మేజర్ న్యూస్ :
ఈ నెల 23వ తేదీ నుండి 28వ తేదీ వరకు శ్రీ నూకాలమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ తెలియజేశారు. ఆదివారం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జాతరకు సంబంధించిన కరపత్రాలను, ఆహ్వాన పత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు, యడ్ల రాజేష్ మాట్లాడుతూ విజయనగరం మంగళవీధి, పాత పశువుల మార్కెట్ ఆవరణలో శ్రీశ్రీశ్రీ నూకాలమ్మవారి 67వ వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22వ తేదీ శనివారం సాయంత్రం నూకాలమ్మవారికి పాలాభిషేకం నిర్వహించి జాతర మహోత్సవాలను ప్రారంభించడం జరిగిందన్నారు . జాతర సందర్భంగా ప్రతీ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాంస్కరితిక కార్యక్రమాలను వీక్షించడానికి వచ్చేవారికి అన్ని రకాలుగా సదుపాయాలు కల్పించామన్నారు. అలాగే 28వ తేదీన శ్రీ అమ్మవారి చల్లదనం మహోత్సవం, అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఘటాలతో, శక్తి, గరడి, పులివేషాలతో జరిగే ఊరేగింపులో భక్తులందరూ పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ సంవత్సరంలాగే అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వజ్రపు నవీన్ కుమార్, యడ్ల భాస్కరరావు, రౌంగలి శరత్ బాబు రాజేంద్రప్రసాద్, వెంపడాపు వెంకటరావు, పిన్నింటి సునీల్ , యడ్ల రాంబాబు, యడ్ల శ్రీనివాస్, తణుకు హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి నిల్వతో రైతులకు భవిష్యత్తులో బంగారు బాటలు

బాడంగి, మార్చి 23, మేజర్ న్యూస్:
కూటమి ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని భూగర్భ జలాలు సంరక్షణ కోసం ఫారం పాండ్స్ ను ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మాణాలను చేపడుతుందని దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తద్వారా నీటి నిల్వలు ఏర్పడి రైతులకు భవిష్యత్తులో బంగారు బాటలు పడతాయని గజరాయుని వలస ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు శనివారం ఆయన సెగ్మెంట్ పరిధిలో లక్ష్మీపురం, ఎరుకుల పాకలు గ్రామాల్లో 11 ఫారం పాండ్స్ లు నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ పాలవలస పార్వతితో కలిసి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫారం పాండ్స్ వలన భూగర్భ జలాలు సంరక్షణ తద్వారా వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నిల్వ ఉన్న నీటిని వినియోగించి పంటలు సాగు చేయవచ్చునని అంతేకాకుండా ఆ నీటి గుంతలు గట్టులపై పలు రకాల పండ్ల మొక్కలు కూరగాయలు సాగు చేసి ఆర్థికంగా రైతులు ప్రయోజనం పొందవచ్చునని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వారితో పాటు అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రెల్లి వర్గానికి న్యాయం చేయాలి

పాలకొండ, మార్చి 23 (మేజర్ న్యూస్):
ఎస్సీ వర్గీకరణలో రెల్లిలకు 1% పర్సెంట్ రిజర్వేషన్ ఇవ్వడం పట్ల రాష్ట్ర రెల్లి కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొట్నాన రవి అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన



మాట్లాడుతూరెల్లి వర్గానికి కేవలం 1% రిజర్వేషన్ కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు, ఇది రాజ్యాంగబద్ధంగా సరికాదని ఆయన పేర్కొన్నారు. 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ నియమాలను పాటించడం లేదని, దశాబ్దాలుగా ఎస్సీ వర్గంలో ఉన్న రెల్లి వర్గానికి జరుగుతున్న అన్యాయం తక్షణమే సరిచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అదే వైఖరి కొనసాగిస్తే, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం" అని హెచ్చరించారు.కులాల సంఖ్యాబలంపై ఆధారపడే రాజకీయ పార్టీలు, ఎస్సీ వర్గీకరణ అమలును కష్టతరం చేస్తున్నాయని కొట్నాన రవి మండిపడ్డారు. వన్ మాన్ కమిషన్ ఇచ్చిన సిఫారసులు అయోమయంగా మారాయని, రెల్లి వర్గానికి జరిగిన అన్యాయాన్ని సరిచేసే విధంగా ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప అధ్యక్షుడు మజ్జి బాబ్జీ, ఆకుల కుమార్, పన్నింటి బాలరాజు కొట్నాన అప్పన్న , బెవర శివ ప్రసాద్ శ్రీకాకుళం జిల్లా నాయకులూ పి. సుధ కర్ మాస్టరు, అర్జి కోటి, లోకొండా లక్ష్మణరావు మాస్టర్ బొమ్మాళి గుమ్మయ్య , లోకొండ గణేశ్, మహేష్ మజ్జి ప్రకాశరావు పాలకొండ ఎంపీపీ ప్రతినిధి బొమ్మాళి సుధా దులి అప్పన్న మాన్యం జిల్లా నాయకులూ సొండీ కుమార్, గౌరీ శంకర్, వీరఘట్టం నాయకులూ బొమ్మాళి బాబురావు మాస్టర్, జలుమూరు అమర్నాథ్, బొత్స ప్రకాశరావు పాల్గొన్నారు.

# కంటి వైద్యుడికి సేవ అవార్డు



పార్వతిపురం రూరల్ , మార్చి 23 (మేజర్ న్యూస్):
పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు జి నగేష్ రెడ్డికి సేవ అవార్డు లభించింది. ఉమ్మడి జిల్లాలోని గజపతినగరం లో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ రీజినల్ సమావేశంలో జోన్ లో ఉన్న ఏడు క్లబ్ ల సమావేశం జరిగింది. అందులో భాగంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొని ఆడారు. పార్వతీపురం లయన్స్ క్లబ్ చేస్తున్న అనేకరకమైన సేవలను గుర్తుచేస్తూ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న నేత్ర వైద్య సేవలు , కంటి వైద్య శిబిరాలు నిర్వహణ భాగంగా మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు.నగేష్ రెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ బెస్ట్ సర్వీస్ అవార్డు ను రీజినల్ చైర్ పర్సన్ సాగి రోహిణి రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమములో క్లబ్ అధ్యక్షులు నాగభూషణ రావు, కార్యదర్శి బుజ్జి మరియు మంచిపల్లి శ్రీరాములు, ద్వారపురెడ్డి శ్రీదేవి మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ఎస్ ఐ పి రమేష్ నాయుడు వెల్లడి**

**మరుపెంట సమీపంలోని కుడి కాలువ సమీపంలో లభ్యం**

గరుగుబిల్లి,మార్చి23,మేజర్ న్యూస్:
మండల పరిధిలోని మరుపెంట గ్రామ సమీపంలోని తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి కాలువ వంతెన వద్ద ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్య మయిందని స్థానిక ఎస్ ఐ పి రమేష్ నాయుడు తెలిపారు. కుడికాలువ వంతెన సమీపంలోని నీటిలో సుమారు 40 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వయస్సు గల గుర్తుతెలియని పురుషుడు మృత దేహమును గుర్తించడం జరిగింద న్నారు.ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ రమేష్ నాయుడు పేర్కొన్నారు.



# నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా పరుగులు పెట్టించడమే లక్ష్యం

**రూ. 3 వేలకోట్లతో నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టే విధంగా కృషి చేస్తున్నా**

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతోపాటు పారిశ్రామికంగా అభివృద్ధికి చర్యలు - విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి వెల్లడి**

పూసపాటిరేగ,మార్చి 23,మేజర్ న్యూస్:
వెనుకబడిన నియోజకవర్గం గా ముద్రపడిన నెల్లిమర్ల నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత తన పార్టీ కార్యాలయం అయిన భోగాపురం మండలంలోని ముంజేరు లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ నాయకులు లోకం ప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో కలిసి తాను చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాసనసభలో నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై చర్చించిన విషయాన్ని ఈ సందర్భంగా విలేకరులతో పాలుపంచుకున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మణిహారం అయినప్పటికీ ఎయిర్ పోర్టు కు అనుగుణంగా కనెక్టివిటీ రహదారులతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కింద డెంకాడ మండలం మోదవలసలో 4000



రకాల ఉత్పత్తులను తయారు చేసే విధంగా అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇలా చేయడం వలన నాలుగు మండలాలకు చెందిన మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతారన్న ఆశాభావాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా 1.5 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఐదేళ్లలో తన చిరకాల వాంఛ అని అన్నారు. 36 ఎకరాలలో మోదవలసలో పర్యాటక పార్కులతో పాటు పర్యాటకులు విడిది చేసే విధంగా రెండువేల గదులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇలా చేయడం వలన పర్యాటక అభివృద్ధితో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన రామతీర్థం, కుమిలి, కోనాడ పురాతన దేవస్థానాలు అభివృద్ధి చెందతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఇలా అభివృద్ధి చేయడం వలన రోజుకు పదివేల మంది పర్యాటకులు వస్తారన్న అంచనాలు గా పేర్కొన్నట్లు తెలిపారు. తీర ప్రాంత గ్రామాలన్నీ సముద్రపు ఉప్పు నీటి పోటుకు తాగునీటికి పనికి రాకుండా పోయాయని, శుద్ధ జలాల అభివృద్ధి లక్ష్యంగా జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ. 660 కోట్లతో ఇంటింటి కొళాయిలను 2027 నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పదే విధంగా నిర్మల నియోజకవర్గం లో ఇప్పటివరకు అగ్నిమాపక కేంద్రం లేనందున వాటి మంజూరు ప్రయత్నం ఫలించినట్లు స్పష్టం చేశారు. భాగాపురం మండలం కొంగవానిపాలెంలో ఎం ఎస్ ఎం ఈ కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడిన, సమయపాలన పాటించకపోయినా, విధుల నిర్వహణలో ఆలస్యత్వం ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు.

## యువతకు సువర్ణవకాశం పీఎం ఇంటర్న్ షిప్

**ఈ నెలాఖరు వరకే దరఖాస్తుకు గడువు**

**సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంబేద్కర్ పిలుపు**



విజయనగరం బ్యూరో, మార్చి 23 , మేజర్ న్యూస్ :
ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమం యువతకు సువర్ణ అవకాశము లాంటిదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వ తేదీ వరకు గడువు ఉందని ఒక ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ తరగతులు, ఐటిఐ, డిప్లమో ఉత్తీర్ణులైన వారు, దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ 500 కు పైగా ప్రముఖ పరిశ్రమలలో ఇంటర్ షిప్ పొందవచ్చునని సూచించారు. నిరుద్యోగుల వయసు 21-24 మధ్య ఉండాలని, ఏడాదికి కుటుంబ ఆదాయం రూ.8 లక్షలు లోపు ఉండాలని తెలిపారు. ఏడాది పాటు జరిగే ఈ శిక్షణకు ఎంపికైన వారికి నెలకు రూ. 5,000 స్టైఫండ్ లభిస్తుందని, అలాగే ఒకే మొత్తంగా రూ. 6000 ప్రోత్సాహకాన్ని కూడా అందజేయడం జరుగుతుందని వివరించారు. ఎంపికైన వారికి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల క్రింద బీమా రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని లేదా 9988853335, 8712655686 నంబర్లకు సంప్రదించవచ్చునని సూచించారు.

**సర్దార్ భగత్ సింగ్. రాజ్ గురు. సుఖ్ దేవ్ ఆశయ సాధన కోసం**

## యువత విద్యార్థులు కృషి చేయాలి

**ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులు**




బొబ్బిలి, మార్చి 23: మేజర్ న్యూస్:
సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత విద్యార్థి యువజన సమాఖ్య ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన కాలేజ్ హాస్టల్ లో సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి రవికుమార్ ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి డివిజన్ కార్యదర్శి బి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువకులను సమీకరించి స్వాతంత్ర ఉద్యమంలో వీరోచితమైన పోరాటం చేశారని గుర్తు చేశారు. సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల ఆశయాలను ఈనాటి యువత ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా నాయకులు ఎం వెంకటేష్ ఆర్ గణేష్ పాల్గొన్నారు.

## జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

**- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**




విజయనగరం క్రైమ్ మార్చి 23, మేజర్ న్యూస్:
విజయనగరం జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అందిస్తున్నసేవలకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండగ సందర్భంగా పోలీసు మెడల్స్ ను ప్రకటించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 23న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తూ, ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఉగాది పండగ సందర్భంగా పోలీసు సేవా మెడల్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వంకుప్రతిపాదనలు పంపామన్నారు. పోలీసుశాఖ పంపిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న (1) విజయనగరం ఎస్బీలో ఎస్ఐగా పని చేస్తున్న వై.సత్యన్నారాయణకు (2) విజయనగరం ఎస్సీ మరియు ఎస్టీ సెల్లో పని చేస్తున్న ఏఎస్ఐ ఎం.ప్రసాదరావుకు (3) గుర్ల పోలీసు స్టేషనులో హెచ్సిగా పని చేస్తున్న పి.రమణ (4) కానిస్టేబులు కే.గోపాలరావులకు (5) ఆర్మ్ రిజర్వులో ఎఆర్ఎస్ఐగా పని చేస్తున్న కే.అప్పలరాజు (6) ఎఆర్ హెడ్ కానిస్టేబులు ఎం.గోవిందం (7) ఎఆర్ కానిస్టేబులు బి.శ్రీనివాసరావులకు సేవా పతకాలకు ఎంపికైనట్లుగా, రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో నిలిపి, ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవ, సేవా పతకాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పని చేసి, జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమటింప జేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆకాంక్షించారు.

## భగత్ సింగ్ ఆశయసాధనకు కృషి చేయాలి



నెల్లిమర్ల, మార్చి 23, మేజర్ న్యూస్:
భగత్ సింగ్ ఆశయసాధనకు కృషిచేయాలని సిపిఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు కోరారు. నెల్లిమర్ల మండలం కొండగుంపాంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ వర్ధంతి నిర్వహించారు. ఈ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. మొయిద పాపారావు మాట్లాడుతూ యువత పెడతోవన పట్టకుండా భగత్ సింగ్ కలలుగన్న నవ సమాజ నిర్మాణం కోసం కృషిచేయాలని కోరారు.కార్యక్రమంలో పోలిపల్లి సూరి, యడ్ల పైడినాయుడు, లెంక రాజారావు, నడిపేన రామ్మూర్తి పాల్గొన్నారు.

## విజయనగరం జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన మాజీ రాజ్యసభ సభ్యులు



విజయనగరం టౌన్, మార్చి 23, మేజర్ న్యూస్:
ఆదివారం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ జిల్లా పార్టీ అధ్యక్షులు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ద్వితీయ పుత్రుడు మజ్జి ప్రణీత్ బాబు మరణం వార్త తెలిసి...మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి చిన్న శ్రీను ని , వారి కుటుంబ సభ్యుల్ని ఇంటికి వచ్చి పరామర్శించి ప్రణీత్ బాబుకి నివాళులు అర్పించారు.

## గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

బాడంగి ,మార్చి 23, మేజర్ న్యూస్:
రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా టిడిపి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ పాలవలస గౌరు ఆదివారం కలిశారు ఈ సందర్భంగా ఆయన గిరిజనుల యొక్క సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించాలని ఆయన విన్నవించుకున్నారు ఎరుకులపాకల గ్రామంలో ఉన్న గిరిజనులు అంతా నిరుపేదలని కులవృత్తులు అన్నీ కాలగర్భంలో కలిసిపో వడం వలన పూట గడవడం వారి అందరికీ కష్టంగా ఉందని వారికి సబ్సిడీపై కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ఆయన కోరారు అంతేకాకుండా గతంలో భూమి రీ సర్వేలో



వచ్చిన లోపం వలన తన పెట్రోల్ బంకు సమస్య చాలా కాలంగా పరిష్కారం కాకపోవడం వలన చాలా ఇబ్బందులు పడ్డానని ఆ సమస్య పరిష్కారం చేసిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు గిరిజనుడు సమస్యను తెలుసుకొని పరిష్కరించినందుకు మంత్రికి పాలవలస గౌరు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని ఆయన మంత్రికి మాటిచ్చారు.

## సాదా సీదాగా సాగిన ఉల్లాస పరీక్షలు



రామభద్రపురం, మార్చి 23: మేజర్ న్యూస్:
ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని స్వయం సహాయక సంఘాలలో ఉన్న నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి "ఉల్లాస్ "పేరుతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రామభద్రపురం మండలం మొత్తం 1830 పరీక్ష లు హాజరు అవ్వగ 1764 పరీక్షలు రాసారు సుమారు మూడు నెలల పాటు మొదట్లోఅభ్యాసకులకు శిక్షణ ఇప్పించే కార్యక్రమం చేపట్టారు. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ఆ సంఖ్యను మధ్యలో కుదించినట్లు బోగట్టా. అభ్యాసకులకు శిక్షణ ఇచ్చే క్రమంలో ఉల్లాస్ ప్రోగ్రామింగ్ అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో మండలంలో వాలంటీర్లు అభ్యాసకులుకు శిక్షణ ఇచ్చే కార్యక్రమమును తూతూ మంత్రముగా,సాగిది కట్టే, కొట్టే, తెచ్చే, అన్న చందముగా నిర్వహించారని విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు పరివ్యక్షన లో పించడం తో పరీక్ష లు సదాశిదగా సాగా యీ కొన్ని సెంటర్లో అభ్యాసకులు ఎవరన్నది కొంతమంది వాలంటీర్లకు తెలియకపోవడం గమనార్హం. ఉదయం 10 గంటలు నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగవలసి ఉండగా, ఉదయం 11 గంటలకే ఈ పరీక్షను ముగించేసిన కేంద్రాలు కొన్ని కనిపించాయి. ఈ కార్యక్రమం . ఈనెల 23వ తేదీన జరిగిన అభ్యాసకుల కోసం నిర్వహించిన రాతపరీక్ష ఇందుకు ఉదాహరణగా నిలిచింది. పరిశీలనలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఉల్లాస్ పేరుతో నిరక్షరాశ్యులకు నిర్వహించిన పరీక్షను కొన్నిచోట్ల ఇన్విజిలేటర్లే రాసినట్లు ఆధారాలతో కూడిన సమాచారం అందింది. ఇది తెలిసిన కొందరు ఇన్విజిలేటర్లు మా ఫోటోలు పేపర్లో వేయద్దని చెప్పటం విశేషం. అందు కారణంగా పోటోలు వేయలేక పోతున్నాం. కొన్ని చోట్ల అభ్యాసకులను ముందుగా పెట్టి, పోటోలు తీసిసిన వెంటనే పంపించేసి ఇన్విజిలేటర్లే పరీక్ష రాసినట్లు పక్కా సమాచారం ఉంది. ఒక్కో ఇన్విజిలేటర్ పదుల సంఖ్యలో పరీక్ష రాశారని బహిరంగంగా విమర్శలు వస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా ఇదే తంతు. దీనికి తోడూ, నీడగా వెలుగు సిబ్బంది పూర్తి సహకారం అందించినట్లు పక్కా సమాచారం ఉంది. ఎవరైనా పక్కాగా ఉల్లాస్ పరీక్షలు జరిగాయని ఈకార్యక్రమం లో వెలుగు ఏపిఎమ్ కోట్ల అన్నపూర్ణ సీసీలు బాలకృష్ణ సింగరాజు హరి పాల్గొన్నారు.

**బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్లో ఉప-పర్యవేక్షక ఇంజనీరుగా**

## భాద్యతలు స్వీకరించిన ఎం.భాస్కరరావు



బొబ్బిలి, మార్చి 23: మేజర్ న్యూస్:
2019వ సంవత్సరం నుంచి బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఉప-పర్యవేక్షక ఇంజనీరు పదవి లేకపోవడంతో పరిపాలనా పరమైన సాంకేతిక అంశాలు చాలా వరకు పెండింగ్ లో ఉన్న విషయం తెలిసిందే. దీని వలన సిబ్బంది, వ్యవసాయ పరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొనడం జరిగింది. ఇప్పుడు శ్రీ ఎం.భాస్కరరావు పదోన్నతి పొంది ఈ పదవీ భాద్యతలు స్వీకరించడంతో సిబ్బంది సంతోషించి వారికి స్వాగతం పలికారు. ఇరిగేషన్ ఎంప్లాయిస్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు మరియు ఇరిగేషన్ సర్కిల్ ఆఫీస్ సూపరింటెండెంట్ మారిశెట్టి సురేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఇఇ ఎం. భాస్కరరావు కి ఏపీఎన్జీవో నాయకులు గొల్లపల్లి రామారావు, అక్కేన సతీష్ కుమార్, పొట్నూరు సునీత, మరిపి దీపిక, బొంగు శ్రీలత, వి.జయలక్ష్మి, బి.స్వరూప తదితర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి దినోత్సవం

**పాల్గొన్న మాజీ సైనిక కుటుంబ సభ్యులు**



బొబ్బిలి, మార్చి 23: మేజర్ న్యూస్:
బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కు నీళ్ళుమార్ పర్యవేక్షణలో పాత కోటలో గల మాజీ సైనిక సంక్షేమ కార్యాలయంలో ఆదివారం సభ్యులంతా ఆదివారం కలిసి భగత్ సింగ్ వర్ధంతి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామినాయుడు మాట్లాడుతూ విముక్తి కోసం ఉద్యమించిన మహా నేత భగత్ సింగ్ అనీ , ఆదర్శాలను ఆచరణలో పెట్టినప్పుడే సార్థకత అని చెప్పిన వీరుడు భగవత్ సింగ్ అని ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి ఏ గోవింద నాయుడు, జాయింట్ సెక్రటరీ రవీంద్ర మోహన్, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్ వి రమణమూర్తి ఇతర మాజీ సైనికులు పాల్గొన్నారు.

## వైభవంగా జమ్మదేవి పేట ఎర్నమ్మ తల్లి తీర్థం

లక్కవరపుకోట, మార్చి 23: మేజర్ న్యూస్:
లక్కవరపుకోటమండలం జమ్మా దేవిపేట గ్రామంలో ఆదివారం శ్రీఎర్నమ్మతల్లి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్ల పందెములు మరియు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ లిడిసిసిబి చైర్మన్ వేచలపు చినరామ నాయుడు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు పాల్గొని ఎడ్ల పందెముల గెలిచిన వారికి బహుమతుల ప్రధానం చేశారు, ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు బెహరా వరహాలుబాబు, బోజంకి ఎర్నాయుడు సత్యనారాయణ , చింతల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




**తెలుగు అసోసియేషన్ నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో**

## గౌరీ నాయుడుకి ఘనసత్కారం

లక్కవరపుకోట, మార్చి 23: మేజర్ న్యూస్:
ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ మరియు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ సంయుక్త నిర్వహణలో రాజమహేంద్రవరం ఆనం రోటరీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన జాతీయ సదస్సు కి రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు, గ్రంథాలయ సేవా సంస్థ కన్వీనర్, సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కోఆర్డినేటర్, కిత్తన్నపేట గ్రామ యువ రచయిత, డాక్టర్ కిలారి గౌరీ నాయుడు ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. బోయి భీమన్న జీవితం-సాహిత్యం అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేసి, పత్ర సమర్పణ చేశారు. జాతీయ సదస్సు



కన్వీనర్ డాక్టర్ టీ పార్థసారథి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, సామాజిక సేవకురాలు నరిసిపల్లి హారిక, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య సత్యనారాయణ, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, బోయి భీమన్న సాహితీ ట్రస్ట్ చైర్ పర్సన్ బోయి హైమావతి, సదస్సు కోఆర్డినేటర్స్ రమావతి, ఈశ్వరి భూషణం, తదితరులు గౌరీ నాయుడుని ఘనంగా సత్కరించారు. ఈ జాతీయ సదస్సులో గౌరీ నాయుడు అభ్యుదయ గీతాలను కూడా ఆలపించారు. మహాకవి, కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యం గురించి జాతీయ సదస్సులో మాట్లాడే అరుదైన అవకాశం రావడం చాలా ఆనందాన్ని కలిగించిందని గౌరీనాయుడు పేర్కొన్నారు. బోయి భీమన్న రచించిన పాలేరు నాటకం చదివి ఎంతోమంది యువకులు పాలేరు తనం మానేసి బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించారని గౌరీ నాయుడు గుర్తు చేశారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక, పరిశోధన, కళా రంగాలలో గౌరీ నాయుడుకి గుర్తింపు రావడం పట్ల వివిధ సాహితీ సంస్థల కార్యవర్గ సభ్యులు, కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ సదస్సుకు ఆహ్వానించిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ కార్యవర్గ సభ్యులకు గౌరీ నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.